అంగన్‌వాడీలతో చిన్నారులకు మనోవికాసం

- కలెక్టర్ పమేలా సత్పతి
- పెద్ద పాపయ్యపల్లిలో శుక్రవారం సభకు హాజరు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 20: ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారుల మనోవికాసం కలుగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రైవేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చక్కటి బోధన జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో శుక్రవారం సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలోని పిల్లలందరికీ సమయం ప్రకారం టీకాలు

గర్భిణికి సీమంతం చేస్తున్న కలెక్టర్

వేయించాలని ఆదేశించారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఉన్నా శుక్రవారం సభలో ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చుని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ గర్భిణులకు సీమంతం చేసి, గ్రామపంచాయతీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, సీడీపీవో సుగుణ, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాల సందర్శన

హుజూరాబాద్ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని, కేసీ క్యాంప్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులు ఉంటున్న గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న ఆహారం మెనూ, వసతుల గురించి వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో రమేష్ బాబు, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత ఉన్నారు.

స్మార్ట్‌సిటీ పనులను గడువులోగా పూర్తి చేయాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 20: నగరంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్లలో పర్యటించారు. మల్టీపర్పస్ పార్క్, రాజీవ్ పార్క్, 16వ డివిజన్‌లోని పద్మనగర్ సమీకృత మార్కెట్‌లో సాగుతున్న పనులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, చివరి దశకు చేరిన మల్టీపర్పస్ పార్క్, రాజీవ్ పార్క్, పద్మనగర్ సమీకృత మార్కెట్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇచ్చిన తేదీలోగా అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ అధికారులు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లకు వెంటనే టెండర్లు చేపట్టాలి

కార్పొరేషన్, సెప్టెంబర్ 20: నగరంలోని బతుకమ్మ పండుగకు అవసరమైన ఏర్పాట్ల కోసం వెంటనే టెండర్లు నిర్వహించి పనులు చేపట్టేలా చూడాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. అధికారులతో కలిసి నగరంలోని తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ బతుకమ్మ పాయింట్లను పరిశీలించారు. డివిజన్లలో బతుకమ్మ ఆడే, నిమజ్జనం పాయింట్ల వద్ద భారీ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్లలో బతుకమ్మ నిమజ్జనం రూట్లలో ప్యాచ్ వర్క్స్, అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉంటే వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ అయూబ్ ఖాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాల రాష్ట్రస్థాయి సమావేశం

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 20: బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి సమావేశాన్ని ప్రెస్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు మాట్లాడుతూ, అభయ హస్తం పథకం ద్వారా బేడ బుడగ జంగాల కుటుంబాలకు రూ.12 లక్షల చొప్పున అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు పరశురామ్, రాజేశ్, శివ, నాగార్జున పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 20: ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలు బుద్ధి చెబుతారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అది మల్లేశం హెచ్చరించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు బీసీ డిక్లరేషన్ అమలు కోసం శుక్రవారం బీసీ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది మాసాలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు బీసీ రిజర్వేషన్ల గురించి ప్రస్తావన లేదని ధ్వజమెత్తారు. బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు శంకరయ్య, సతీశ్, రేణుక, నాగలక్ష్మి, నరసయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 20 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం మధ్యాహ్నం కార్మికులు ఆకస్మికంగా ధర్నాకు దిగారు. కార్యాలయంలో పనిచేసే 15మంది మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులను తొలగిస్తున్నారని సమాచారం అందడంతో ఒక్కసారిగా విధులకు హాజరుకాకుండా ఆందోళనకు చేపట్టారు. అనంతరం కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. కొంత కాలంగా విధులకు హాజరుకాని వారిని కేవలం మందలించడమే తమ ఉద్దేశమని, కార్మికులు ఎవరినీ తొలగించడం లేదని స్పష్టం చేశారు. కమిషనర్ హామీతో కార్మికులు ఆందోళన విరమించారు.

బతుకు బాధలు, మనసు గాయాలే కవిత్వాన్ని పండిస్తాయి

పురస్కారం స్వీకరిస్తున్న నందిని సిధారెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20 : బతుకు బాటలో ఎదురయ్యే బాధలు, మనసును ముక్కలు చేసే గాయాల పునాదుల్లోంచి మాత్రమే అసలైన కవిత్వం ఉద్భవిస్తుందని ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ వైతాళికుడు నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘం బాధ్యుడు, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి తల్లిదండ్రులు బుర్ర నర్సమ్మ–లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మట్టి వాసనలే సాహిత్య ఊటలకు ప్రేరణ అని, అమ్మనాన్నల దీవెనలే మన అస్థిత్వమని పేర్కొన్నారు. కార్యక్రమానికి కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి సభాధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, విశిష్ట అతిథిగా బైస దేవదాసు, ప్రత్యేక అతిథిగా సాహితీవేత్త దాస్యం సేనాధిపతి, గౌరవ అతిథిగా సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ హాజరయ్యారు.

సిరిపురం ఈశ్వర్‌కు డాక్టరేట్

డాక్టరేట్ అందుకున్న ఈశ్వర్

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20 : జిల్లా కేంద్రానికి చెందిన సిరిపురం ఈశ్వర్‌కు డాక్టరేట్ లభించింది. 28 సంవత్సరాలుగా విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించి ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దినందుకు గానూ ఆయనకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చెన్నై గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సిరిపురం ఈశ్వర్ మాట్లాడుతూ, డాక్టరేట్ లభించడం ఆనందంగా ఉన్నదన్నారు.

అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి యూనివర్సల్ ఐకాన్ అచీవర్ అవార్డ్

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20 : అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రతిష్టాత్మక యూనివర్సల్ ఐకాన్ అచీవర్ అవార్డ్–2024 అందుకోగా, ఆయనను శుక్రవారం వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దళిత మధ్య విభేదాలను సృష్టించేందుకు కుట్రలు'

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 20: ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేస్తామని ప్రకటించి సీఎం రేవంత్‌రెడ్డి దళితుల మధ్య విభేదాలను సృష్టించాలని కుట్రలు చేస్తున్నారని ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవనంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమాశంలో మాట్లాడారు. సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్‌లో పెండింగ్‌లో ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఎలా వేస్తారని ప్రశ్నించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 30న సచివాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా దళితులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజలింగం, మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, మాలమహానాడు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు యనమల మంజుల, నాయకులు శేఖర్, శ్రీనివాస్, కరుణాకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థినిపై టీచర్ అసభ్య ప్రవర్తన

రాంనగర్/ కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20 : విద్యార్థులకు చదువు చెప్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు తన కీచక బుద్ధిని చూపించాడు. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కుటుంబ సభ్యులు సదరు టీచర్‌పై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. నగరంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న నారాయణ ప్రైవేటు స్కూల్‌లో సోషల్ సబ్జెక్టు బోధిస్తున్న శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించడంతో, ఓ విద్యార్థిని అతడి వేధింపులు భరించలేక తల్లిదండ్రులకు చెప్పుకొంది. దీంతో శుక్రవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని నిలదీయడంతో దాటవేసే ప్రయత్నం చేశాడు. స్కూలు యాజమాన్యం సైతం సదరు ఉపాధ్యాయుడికి బాసటగా నిలవడంతోపాటు, విద్యార్థిని తల్లిదండ్రుల మాటకు విలువనివ్వకపోవడంతో టీచర్‌పై దాడి చేశారు. ఆ తర్వాత పాఠశాల పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో వచ్చి దాడి చేయడంతో శ్రీనివాస్ అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో శ్రీనివాస్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. కాగా, సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారికి వినతి పత్రం అందజేశారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలకు వెలిచాల విద్యార్థులు

రామడుగు, సెప్టెంబర్ 20 : వెలిచాల ఉన్నత పాఠశాల విద్యార్థులు 13 మంది ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేశ్ తెలిపారు. అండర్ 17 విభాగంలో కబడ్డీలో పాఠశాలకు చెందిన మధుప్రియ, సంజన, మహర్షి, ఖోఖోలో శ్రీవిద్య, హర్ష, మహిత, మహర్షి, సాయిచరణ్, చరణ్‌తేజ, వాలీబాల్‌లో చరణ్‌తేజ, ఆదిత్య, అథ్లెటిక్స్‌లో శివరామ్ ఎంపికైనట్లు వెల్లడించారు. అండర్14 విభాగంలో కబడ్డీలో అరుంధతి, నిఖిల్, ఖోఖోలో అనిత, నిఖిల్, వాలీబాల్‌లో నిఖిల్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులతో పాటు పాఠశాల పీడీ దత్తాత్రేయ శర్మను హెచ్ఎం అభినందించారు. ఇక్కడ ఉపాధ్యాయులు పద్మలతాదేవి, సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, అలీమోద్దీన్, మల్లేశం, పుష్పలత, రమేశ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన సలహాదారు సముద్రాల జనార్దన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం నగర శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ఒక పీఆర్సీ, ఐదు డీఏలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వం మూడు డీఏలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకున్నా ఎన్నికల సంఘం నిలిపివేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ విషయాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో నాలుగో తరగతి ఉద్యోగులుగా విధులు నిర్వహించి, రిటైర్‌మెంట్ తీసుకున్న వారికి నామమాత్రపు పెన్షన్ వస్తున్నదని, ఈమొత్తంతో కుటుంబం గడవడం కష్టసాధ్యమైన దృష్ట్యా వారికి ఆహార భద్రత కార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో సత్యనారాయణ, ఆనంద్, మోసం అంజయ్య, రాములు, వైద్య విశ్వనాథంతో పాటు పలువురు పాల్గొన్నారు.

'దసరా' ఘనంగా నిర్వహించుకుందాం

జమ్మికుంట, సెప్టెంబర్20: దసరా పండుగను మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఘనంగా నిర్వహించుకుందామని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. దసరా పండుగ ఏర్పాట్లు, అభివృద్ధి పనులకు నిధులు, తదితర అంశాలపై కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్ అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో 31 ఎజెండా అంశాలను సభ్యుల ముందుంచారు. 30 వార్డుల్లో డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులపై సభ్యులు చర్చించారు. అనంతరం ఏకగ్రీవంగా ఆమోద తీర్మానాలు చేశారు. తర్వాత చైర్మన్ మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా అభివృద్ధి కోసం పాటుపడుదామని పిలుపునిచ్చారు. ఇక్కడ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న–కోటి, మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ నరేశ్, టీపీవో శ్రీధర్, వార్డు కౌన్సిలర్లు, తదితరులున్నారు.

ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి ముప్పు

జమ్మికుంట, సెప్టెంబర్ 20: ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్‌ను వాడకూడదని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా సభ్యులతో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జ్యూట్ బ్యాగులను వాడాలని సూచించారు. ఇక్కడ మేనేజర్ రాజిరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మెప్మా సీఎల్ఆర్పీలు, ఆర్పీలు, సంఘం సభ్యులున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : సుదీర్ఘ కాలంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వోను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నట్లు సంఘం జిల్లా కన్వీనర్ పి.మనోహర స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సదరం సర్టిఫికెట్లలో జరుగుతున్న అవకతవకల మూలంగా అసలైన దివ్యాంగులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపకరణాలు కూడా అర్హులైన వారికి మాత్రమే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని, అంత్యోదయ కార్డుల పంపిణీ వెంటనే చేపట్టాలని కోరారు. డీఆర్‌వోను కలిసిన వారిలో మార్త మహేశ్, దేశ రాజు, పుప్పాల రాము, వెగ్గలం వెంకటేశం, తీగెల సత్యనారాయణతో పాటు పలువురు ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

సైదాపూర్, సెప్టెంబర్20: నియోజకవర్గకేంద్రం హుస్నాబాద్‌లోని శుభం గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసు

చిగురుమామిడి, సెప్టెంబర్ 20 : కొండాపూర్ గ్రామంలో హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వైపు అక్రమంగా గోవులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో 5 పశువులు, 3 ఆవులు, 2 దూడలు ఉండగా, వాటిని కొండాపూర్ గ్రామ శివారులో ఉన్న గోశాలకు తరలించామని ఎస్ఐ రాజేశ్ తెలిపారు. అక్రమంగా ఆవులను తరలిస్తున్న డ్రైవర్ సాజిద్ ఖురేషితో పాటు వాహనం యజమాని సాజిద్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జమ్మికుంట, సెప్టెంబర్20: మండలంలోని మాచనపల్లి 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మూడో శనివారం సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పట్టణ ఏఈ సురేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం, మారుతీనగర్, హౌసింగ్‌బోర్డు, దుర్గా, అంబేద్కర్‌కాలనీ, పాత మార్కెట్, మసీద్ ఏరియా, మోత్కులగూడెం ఇండస్ట్రియల్ ఏరియా, మాచినపల్లి గ్రామంలో మధ్యాహ్నం 12.30 నుంచి 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న పోషణ మాసం

కార్పొరేషన్/గన్నేరువరం/వీణవంక/శంకరపట్నం/మానకొండూర్ రూరల్/సైదాపూర్, సెప్టెంబర్ 20: నగరంతో పాటు వీణవంక, గన్నేరువరం, శంకరపట్నం, మానకొండూర్ మండలాల్లోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ, పోషణ మాసం కార్యక్రమాలు నిర్వహించారు. వీటికి అధికారులు హాజరై పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించారు. నగరంలోని మారుతీనగర్, మంగళివాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యమ్రంలో ఐసీడీఎస్ అధికారులతోపాటు డివిజన్ కార్పొరేటర్ నేతికుంట యాదయ్య పాల్గొన్నారు. సైదాపూర్ మండలం బూడిదపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఓటర్ల జాబితాను సవరించండి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 20: గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా తయారు చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని, వాటిని సవరించాలని దుర్శేడ్ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు కరీంనగర్ రూరల్ తహసీల్దార్ రాజుకు వినతి పత్రం అందించారు. అలాగే ఎలబోతారం గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు జరిగాయని ఆర్టీపీ సామాజిక కార్యకర్త ఎం సుధాకర్ రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి, జాబితా సవరించాలని కోరారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవా

కార్పొరేషన్/ కమాన్‌చౌరస్తా/ చొప్పదండి/హుజూరాబాద్ రూరల్/ కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 20: జిల్లాలోని వివిధ మండలాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నగరంలోని 42వ డివిజన్‌లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యతను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేచినేని అశోక్‌రావు, స్థానికులు పాల్గొన్నారు. వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ పరిసర ప్రాంతాలలో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. చొప్పదండి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ, రన్, స్వచ్ఛతా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన 'వేస్ట్–ఆర్ట్' కళా ప్రదర్శన తిలకించి అభినందించారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం ద్వారా పరిసరాలను శుభ్రం చేశారు. వలంటీర్లను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శనిగరపు రజిత అభినందించారు. కరీంనగర్ మండలం నగునూర్ జడ్పీహెచ్ఎస్‌లో హెచ్ఎం రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఏ సంజీవరావు పాల్గొని, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

23న ఇంటర్వ్యూలు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20 : జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి 23న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు 1:3 చొప్పున ఇంటర్వ్యూలకు ఆహ్వానం అందిస్తామని చెప్పారు. వివరాలకు www.karimnagardeo.com వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 20: కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి కుమారస్వామి అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మోకు జారి తాటిచెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం అతడిని వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పెరటి కోడి పిల్లల పంపిణీ

రామడుగు, సెప్టెంబర్ 20: మండలంలోని రామడుగు, షానగర్, శ్రీరాములపల్లి గ్రామాలకు చెందిన వందమంది ఎస్సీ లబ్ధిదారులకు మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శుక్రవారం 5 నుంచి 6 వారాల వయస్సు కలిగిన 14 వందల గ్రామ ప్రియ పెరటి కోడిపిల్లలతో పాటు దాణా, నీటి తొట్టీలను పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డా. దాసరి శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ డీవీఏహెచ్‌వో కార్యాలయ ఏడీ డా.వినోద్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.రాంబాబు, అధ్యాపక బృంద సభ్యులు డా.జి.అంబిక, రామడుగు పశువైద్యాధికారి డా.అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 20: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు శుక్రవారం జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు నోటీసులు జారీ చేశారు. మండలంలోని కేజీబీవీ ఉపాధ్యాయిని కె. రాజేశ్వరి, అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని కె. శ్రీవాణి, పచ్చునూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని జి.అంబిక, ఈదుల గట్టెపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు కె. యువరాజు ఈ నెల 19న మండలంలోని వెల్ది ఉన్నత పాఠశాలలో జరిగిన (తెలుగు భాషోపాధ్యాయుల) స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆలస్యంగా హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సి ఉండగా, వీరు 10:20 గంటలకు హాజరు కావడంతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

ఎస్ఐ ఉద్యోగం సాధించిన రాంపూర్‌వాసికి సత్కారం

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 20: రాంపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ ఇటీవల ఎస్ఐ ఉద్యోగం సాధించగా, పద్మశాలీ సంఘం హుజూరాబాద్ మండలాధ్యక్షుడు సంగెం సత్యనారాయణ, జిల్లా కో కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సత్కరించారు. పద్మశాలీ సంఘం జిల్లా కన్వీనర్ అడిచెర్ల శ్రీనివాస్, రాంపూర్, రంగాపూర్ గ్రామాధ్యక్షులు ముషం గణేశ్, సమ్మయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలు లాభదాయకం

జమ్మికుంట, సెప్టెంబర్20: ఆయిల్‌పామ్ తోటల్లో అంతరపంటలను సాగు చేయడం రైతులకు లాభదాయకమని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో రైతు నీల సమ్మయ్య ఆయిల్‌పామ్ తోటలో బంతి పూల సాగు చేస్తుండగా, గురువారం శాస్త్రవేత్త అంతర పంట క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా రైతుకు తగు సలహాలు, సూచనలు అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, సెప్టెంబర్20: సోమారం మోడల్ స్కూల్‌లో కెమిస్ట్రీ పీజీటీ పోస్టు ఖాళీగా ఉందని, అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ బండారి సంపత్‌కుమార్ తెలిపారు. రసాయన శాస్త్రంలో పీజీ, బీఈడీ పూర్తి చేయడంతో పాటు టెట్ క్వాలీఫై అయిన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 24లోగా సోమారం మోడల్ స్కూల్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సంప్రదించాలని కోరారు.

ఆచరణ తక్కువ.. ఆర్భాటం ఎక్కువ



కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ప్రదర్శిస్తున్న గ్యాస్ బండ ఎయిర్ బెలూన్

కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : ఓ వైపు మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ గ్యాస్ సబ్సిడీ రావడం లేదని నగరంలో వేల సంఖ్యలో వినియోగదారులు చెబుతుండగా, మరోవైపు రూ.500కే వంట గ్యాస్ అందిస్తున్నట్లు కలెక్టరేట్ ప్రధాన ద్వారం పక్కనే గ్యాస్ బండ నమూనా ఎయిర్ బెలూన్ ఏర్పాటు చేసి ప్రచార ఆర్భాటం చేస్తుండడంపై సామాన్య ప్రజానీకం నివ్వెరపోతున్నది. దరఖాస్తుల పరిశీలన కూడా సక్రమంగా చేయకుండా పెండింగ్‌లో పెట్టి, తమ పథకం పూర్తి స్థాయిలో అమలవుతున్నదనే భావన కల్పించేలా ప్రచారం చేసుకోవడంపై మండిపడుతున్నది.

బాయిల్డ్ మిల్లుల్లో తనిఖీలు

జమ్మికుంట, సెప్టెంబర్ 20: పట్టణంలోని పలు బాయిల్డ్ మిల్లుల్లో శుక్రవారం సివిల్ సప్లయి డీటీ వసంత్‌రావు, ఎఫ్ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. ప్రభుత్వానికి పెట్టాల్సిన సీఎమ్మార్ యాసంగి, వానకాలం ధాన్యం గోదాముల్లో ఉందా.. లేదా? అని పరిశీలించారు. బకాయి ఉన్న సీఎమ్మార్‌ను త్వరగా పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణకు నెలాఖరులోగా సమావేశం

కార్పొరేషన్, సెప్టెంబర్ 20: మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి అభిప్రాయ సేకరణకు ఈ నెలాఖరులోగా సమావేశం నిర్వహించాలని సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం సుడా కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కమర్షియల్ బిల్డింగ్స్ పర్మిషన్ల చార్జీల విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. దానివల్ల లక్షల రూపాయలు రెవెన్యూ కోల్పోతున్నామని, వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. ఈనెల ఆఖరులోగా మంత్రుల సమయం తీసుకొని మాస్టర్ ప్లాన్ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయ సేకరణ చేయాలన్నారు. అభివృద్ధి పనులపై అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో సుడా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20: కొన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండా చదువును నిర్లక్ష్యం చేస్తున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ సంఘ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్ , గణేశ, నగర అధ్యక్ష కార్యదర్శులు అభిలాష్, ఉమామహేశ్వర్, నాయకులు అభిలాష్, నీపుణ్ రాజ్, నాగేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు పారమిత విద్యార్థులు

కొత్తపల్లి, సెప్టెంబర్ 20: సిరిసిల్ల జిల్లాలో ఈనెల 21 నుంచి 23 వరకు జరుగనున్న 10వ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బాలాజీ, శ్రీకర్ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి జె. శ్రీహిత, అలుగునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి టి. అభినవ్ చక్రవర్తి ఈ పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. వీరిని పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఈ ప్రసాద్ రావు, డైరెక్టర్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

రాంనగర్/ కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 20: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన రైతు కరెంట్ పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు ప్రకారం.. నగునూర్‌కు చెందిన బోనగిరి సత్తయ్య (51) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం భార్యాభర్తలిద్దరూ వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లారు. కరెంటు మోటర్ ఆఫ్ చేసేందుకు అక్కడే ఉండిపోయిన సత్తయ్య ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లిన స్థానికులకు సత్తయ్య చెప్పులు కన్పించడంతో అనుమానం వచ్చి కౌసల్యకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు బావిలో పరిశీలించగా, సత్తయ్య మృతదేహం కన్పించింది. కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న సత్తయ్య, జబ్బు కారణంగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటాడని కౌసల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

గన్నేరువరం, సెప్టెంబర్ 20: మండల కేంద్రానికి చెందిన మంగళారపు రాయమల్లు(55) గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పుల్లెల తిరుపతి, పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ వ్యవసాయ భూమి విషయంలో వేధింపులకు గురి చేయడంతో రాయమల్లు ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడి రిమాండ్

వీణవంక, సెప్టెంబర్ 20: బాలికను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 11 సంవత్సరాల బాలికను వేధించి, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తిరుపతి తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి, శుక్రవారం హుజూరాబాద్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

దివ్యాంగులకు సేవ చేయాలి

తిమ్మాపూర్, సెప్టెంబర్20: ఎల్ఎండీ కాలనీలో గల మానసిక వికలాంగుల పాఠశాలను ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర హెల్త్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి శుక్రవారం సందర్శించారు. ఆలయ ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు సేవ చేయాలని సూచించారు. పాఠశాలకు వసతుల కల్పనకు వాగేశ్వరి విద్యా సంస్థల సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి సహకారంతో రూ.30వేల చెక్‌ను ప్రిన్సిపాల్ సతీశ్‌కు అందజేశారు. ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేశ్, మిట్టపల్లి రాజేందర్, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి, బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

రాంనగర్, సెప్టెంబర్ 20: కరీంనగర్ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా బిల్ల కోటేశ్వర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం జరిగిన బదిలీల్లో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సరిలాల్ బదిలీ కాగా, ఆయన స్థానంలో కోటేశ్వర్‌కు పోస్టింగ్ కల్పించారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం

తిమ్మాపూర్, సెప్టెంబర్ 20: ఇందిరానగర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా దామ అంజయ్య ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కూన చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కుంభం వెంకటేశ్, కార్యదర్శులుగా దామ నర్సయ్య, కూన రమేశ్, కూన శ్రీనివాస్, కూన పెద్ద అంజయ్యను ఎన్నుకున్నారు.

కరాటేలో మెరిసిన సన్నిహిత

శంకరపట్నం, సెప్టెంబర్ 20: కాచాపూర్‌కు చెందిన ఊకంటి సన్నిహిత ఈ నెల 15న కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ చూపి సిల్వర్ మెడల్‌ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా కేశవపట్నం ఎస్ఐ రవి సన్నిహితను సన్మానించి అభినందించారు. ఇక్కడ కరాటే కోచ్ ఎస్‌కే జలీల్ పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా వడ్ల రాజు

శంకరపట్నం, సెప్టెంబర్ 20: సీపీఎం కొత్తగట్టు గ్రామశాఖ నూతన కార్యదర్శిగా వడ్ల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వెల్మారెడ్డి రాజిరెడ్డి హాజరు కాగా, కమిటీ సభ్యులు మైదంశెట్టి యుగంధర్, గూడెం సదానందం, సూరయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్ర సందర్శన

చొప్పదండి, సెప్టెంబర్ 20: దేశీ శిక్షణలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 40 మంది ఇన్‌పుట్ డీలర్స్ శుక్రవారం మండలంలోని పెద్ద కుర్మపల్లి గ్రామం మావురం మల్లికార్జునరెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న విభిన్న వరి వంగడాల గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నిలకడగా పత్తి ధరలు

జమ్మికుంట, సెప్టెంబర్20: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో కాటన్ ధరలు నిలకడగా ఉన్నాయి. శుక్రవారం మార్కెట్‌కు విడి పత్తి 99 క్వింటాళ్లు వచ్చింది. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7800, మోడల్ ధర రూ.7600, కనిష్ఠ ధర రూ.6200 పలికింది. బ్యాగుల్లో 14 క్వింటాళ్ల పత్తి రాగా, గరిష్ఠ ధర రూ.7011, మోడల్ ధర రూ.6651, కనిష్ఠ ధర రూ.6511తో వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను మార్కెట్ కార్యదర్శి మల్లేశం పర్యవేక్షించారు. అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ.. మార్కెట్‌కు శనివారం, ఆదివారం సాధారణ సెలవులుకాగా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతికి సంతాప సూచకంగా వ్యాపారులు, అడ్తిదారులు, దడ్వాయిలు, కార్మికుల విజ్ఞప్తి మేరకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నామని తెలిపారు.

పుష్పాలు అందించి.. పథకాలు వివరించి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 20: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ మర్యాద దినోత్సవాన్ని పురస్కరించుకొని బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య ఆధ్వర్యంలో కంట్రోలర్స్, సిబ్బంది ప్రయాణికులకు గులాబీ పుష్పలను అందించి గౌరవించారు. ఆర్టీసీ ప్రవేశపెడుతున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో కంట్రోలర్ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189